## క్లుప్తంగా

### దేవాలయాల్లో సామూహిక హారతులు

భట్టిప్రోలు: పాల్గుణ శుద్ధ పౌర్ణమి, హోలీ పురస్కరించుకుని సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం దేవాలయాల్లో సామూహిక హారతులు నిర్వహించారు. రాక్షసి సంహారం జరిగిన సందర్భంగా హోలీ పండుగను నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుందని ఎస్ఎస్ఎఫ్ బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు తెలిపారు. ఆయా దేవాలయాల పరిధిలో పురవీధులలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, భక్తులు, చిన్నారులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని మహిళా కన్వీనర్ బూర్లె అరుణకుమారి పర్యవేక్షించారు.

### వాహనం ఢీకొట్టడంతో వ్యక్తి మృతి



నగరం: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని నగరం శివారు మాన్యంవారి పాలెం రహదారిలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ కోటేశ్వరరావు సమాచారం మేరకు నగరం మండలం పీతావారిపాలెం గ్రామానికి చెందిన ఎస్ శివశంకర్(42) ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్లుతున్న సమయంలో మాన్యంవారిపాలెం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో శివశంకర్ తలపై నుంచి వాహనం వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ద్విచక్ర వాహనంపై ఉన్న మరో వ్యక్తి గోవర్ధన్‌రావుకు తీవ్ర గాయాలయ్యాయి. గోవర్ధన్‌రావును రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడు భార్య వాకాలమ్మ ఫిర్యాదు మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడు శివశంకర్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శివశంకర్ తాపీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు.

### రహదారి ప్రమాదంలో వ్యక్తి మృతి



భట్టిప్రోలు: ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఓ వ్యక్తి రాళ్ల గుట్ట పక్కనే ఉన్న గుంతను గమనించక ప్రమాదవశాత్తూ మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే రేపల్లె మండలం కారుమూరుకు చెందిన తెనాలి నాగయ్య (45) ఆదివారం రాత్రి కొల్లూరులో పని ముగించుకుని స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలు దేరాడు. వెల్లటూరు ఎస్సీ కాలనీ సమీపంలోకి వచ్చే సరికి రాళ్ల గుట్ట పక్కనే ఉన్న గుంత కనిపించక పోవడంతో ఆ వేగానికి ప్రమాదవశాత్తూ గుంతలో పడ్డాడు. ఈ క్రమంలో తల, చేతులకు తీవ్ర గాయాలవ్వడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని 108లో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇతడికి భార్య, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. ఎదురుగా వచ్చే వాహనం ఢీకొట్టి వెళ్లడంతో ఈ ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కాసుల శ్రీనివాసరావు తెలిపారు.

### ఆర్టీసీ ఉద్యోగి సేవకు సత్కారం



తెనాలి: వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన ప్రత్యేక సభలో తెనాలికి చెందిన ఈపూరి ప్రేమ్‌కుమార్‌కు 'మన గద్దరన్న ఐడియాలజీ అవార్డు–2024ను ప్రదానం చేసి సత్కరించారు. ఏపీఎస్ ఆర్టీసీ, తెనాలి డిపో మేనేజర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ప్రేమ్‌కుమార్ చేస్తున్న సామాజిక సేవకు ఈ గౌరవం దక్కింది. కరోనా సమయంలో ఆర్టీసీ ఉద్యోగులకు, తన స్వగ్రామం పెదరావూరులో అందించిన సేవలు, పేదలకు అన్నదానం, శవదహన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. కరోనా కాలంలో ఎనిమిది పర్యాయాలతో సహా మొత్తం 28 సార్లు రక్తదానం చేశారు. ప్రేమ్‌కుమార్‌కు ఆర్టీసీ ఉద్యోగులు, పెదరావూరు గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

### ఏప్రిల్ 1 నుంచి పరిశుద్ధ సమాజ కూడికలు

తెనాలిఅర్బన్: ఫిలదెల్ఫియా చర్చి ఆధ్వర్యంలో ఏప్రిల్ 1, 3 తేదీల్లో పరిశుద్ధ సమాజ కూడికలు నిర్వహించనున్నట్లు పాస్టర్ సీహెచ్ నతానియేలు ఒక ప్రకటనలో తెలిపారు. మారీసుపేట రెండు గేట్ల మధ్యలోని కొలకలూరు మత్తయ్య హాస్టల్ ఆవరణలో ప్రతిరోజు రాత్రి 7 గంటలకు సభలు ప్రారంభమవుతాయని చెప్పారు. సభల్లో విజయవాడకు చెందిన బ్రదర్ సీహెచ్ డేవిడ్ బ్రెస్‌హాం, ధరణికోటకు చెందిన బ్రదర్ రేనాల్డ్స్ బాబులు వాక్యపరిచర్య చేస్తారని చెప్పారు. అందరూ పాల్గొనాలని కోరారు.

## వైభవంగా లక్ష్మీ గణపతి విగ్రహ ప్రతిష్ట



లక్ష్మీ గణపతి విగ్రహాలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రఘుపతి



లక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు



ప్రత్యేక అలంకారంలో శ్రీ భూ నీళా సమేత వరదరాజస్వామి

కర్లపాలెం: మండల పరిధిలోని పాతనందాయపాలెంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో సోమవారం వైభవంగా శ్రీ లక్ష్మీ గణపతి విగ్రహ ప్రతిష్ట జరిగింది. గ్రామ ప్రజలు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా శ్రీ లక్ష్మీ గణపతి విగ్రహ ప్రతిష్టను వేద పండితులు నిర్వహించారు. బాపట్ల ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి కోన రఘుపతి లక్ష్మీ గణపతి విగ్రహాలను దర్శించుకుని పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో భక్తులకు అన్న సంతర్పణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని నూతనంగా ప్రతిష్ఠించిన స్వామి వారి విగ్రహాలను దర్శించుకుని అన్న ప్రసాదాలను స్వీకరించారు.

### కమనీయం..రామలింగేశ్వరుని కల్యాణం

చిన్నపరిమి(వేమూరు): చుండూరు మండలంలోని చిన్నపరిమి గ్రామంలో శ్రీ గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి నిర్వహించిన రథోత్సవం కార్యక్రమంలో వరికూటి లక్ష్మి, గౌతమ్ పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు కొండా శివపార్వతి, కొండ శివప్రసాద్ రెడ్డి, ఆలయ ట్రస్ట్ చైర్మన్ బ్రహ్మ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సాయిబాబరెడ్డి, సొసైటీ చైర్మన్ బ్రహ్మ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రామలింగేశ్వర స్వామి పూజల్లో పాల్గొన్న వరికూటి లక్ష్మి

### ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

రేపల్లె రూరల్: పట్టణంలోని ఉప్పూడి రోడ్డులో వేంచేసి యున్న శ్రీ లక్ష్మీ గోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. నిత్యహోమం, బలిహరణ, మహా పూర్ణాహుతి, ధ్వజారోహణం, ద్వా దశ ప్రదక్షిణలు, పవళింపు సేవ తదితర పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పా ల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

### పెదపులివర్రులో వైభవంగా బ్రహ్మోత్సవాలు

పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రులో కొలువైన శ్రీ భూ నీళా సమేత వరదరాజ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం, రాత్రి నిత్యహోమం, బలిహరణ నిర్వహించారు. రాత్రి పూర్ణాహుతి నిర్వహించి ధ్వజారోహణం గావించారు. కార్యక్రమాలను దేవస్థాన కార్యనిర్వహణాధికారి మేకా సాంబశివరావు పర్యవేక్షించారు. పూజా కార్యక్రమాలను అర్చకులు శాస్త్ర యుక్తంగా జరిపారు.

### ఘనంగా లక్ష్మీదేవి జన్మదిన వేడుకలు

రేపల్లె రూరల్: ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి మహాలక్ష్మి దేవి జన్మ దినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో సోమవారం ప్రత్యేక వేడుకలను ఆలయ అర్చకులు నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఉదయం నుంచి సుప్రభాత సేవలతో అభిషేకాలు నిర్వహించి అమ్మవారిని లక్ష్మీదేవిగా అలంకారం చేశారు. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. ఆలయ ఆవరణలో మహిళలు లలితా సహస్రనామం, విష్ణు సహస్ర నామ పారాయణలతో పాటు భక్తి గీతాలను ఆలపించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

## గ్రామదేవత బూరుగులమ్మకు సారె సమర్పణ



ప్రత్యేక అలంకరణలో గ్రామదేవత బూరుగలమ్మ



అమ్మవారి సారె ఊరేగింపు

రేపల్లె రూరల్: ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని ఓల్డ్‌టౌన్‌లో వేంచేసియున్న గ్రామ దేవత శ్రీ బూరుగులమ్మ ఆలయంలో సోమవారం ఆలయ అర్చకుడు నందివెలుగు భాను సుధాకర్ గురుకులు ఆధ్వర్యంలో నెల సంబర మహోత్సవాలు, సారె సమర్పణ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జామునే అమ్మవారికి అభిషేక మహోత్సవాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ గావించారు. అంకమ్మ చెట్టు వద్ద నుంచి మేళ తాళాలతో మహిళలు ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి సారెను తీసుకువచ్చారు. పసుపు, కుంకుమ, పువ్వులు, గాజులు, మిఠాయిలు, వడిగంటి బియ్యంతో కూడిన సారెను అమ్మవారికి సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

## నేత్రానందంగా చెన్నకేశవుని గ్రామోత్సవం



పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసి యున్న శ్రీ చెన్న కేశవ స్వామి దేవాలయంలో స్వామి వారి కల్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా చెన్నకేశవ స్వామి వారిని సోమవారం ప్రత్యేకంగా అలంకరించి గరుఢ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామివారి గరుఢ వాహనానికి పసుపు, కుంకుమ, వేపాకులు కలిపిన నీళ్ళను వారబోసి హారతులిచ్చి భక్తి శ్రద్దలతో పూజలు నిర్వహించారు.

## ముగిసిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం



ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు

తెనాలి: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, స్థానిక ఏఎస్ఎన్ ఫార్మసీ కాలేజి ఎన్ఎస్ఎస్ విభాగం దత్తత తీసుకున్న రూరల్ మండల గ్రామం పెదరావూరులో వారం రోజుల ప్రత్యేక శిబిరం సోమవారంతో ముగిసింది. తొలిరోజున నేల పరిరక్షణతో మొదలుపెట్టి, రెండోరోజున మొక్కలు నాటారు. తర్వాతిరోజు ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. నాలుగోరోజు నుంచి స్వచ్ఛ భారత్, మత్తుపదార్థాలతో కలిగే హానిపై అవగాహన, భూగర్భ జలాల పరిరక్షణ, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్లపల్లి వెంకటరమణ, ఎన్ఎస్ఎస్ విభాగం అధికారి కె.కళ్యాణ్‌చక్రవర్తి, ఎన్ఎస్ఎస్ విభాగం వలంటీర్లు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమానికి సహకరించిన యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ రవిశంకర్‌రెడ్డికి కాలేజి ప్రిన్సిపాల్ ధన్యవాదాలు తెలియజేశారు.

## ఓటు హక్కును వినియోగించుకోండి



సుల్తానాబాద్‌లో ఓటు హక్కుపై అవగాహన కలిగించే ముగ్గు



ప్రతిజ్ఞ చేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ అనూష

### మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనూష

తెనాలిఅర్బన్: మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ కె.అనూష పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా సుల్తానాబాద్‌లో మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఓటు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ సిబ్బంది పాల్గొని ఓటు విలువను తెలియజేసే ముగ్గులను అక్కడ రూపొందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు ఒక వజ్రాయుధమని చెప్పారు. ప్రజాస్వామ్యంలో ఓటుకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. అందరూ నిష్పక్షపాతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ఓటు వినియోగిస్తామనే ప్రతిజ్ఞను చేశారు. కార్యక్రమంలో ఏసీపీ సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎ.రామచంద్రరావు, డి.శ్రీనివాసరావు, వై.అనుపమ, టి.సుధాకర్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



రూట్ మార్చ్‌లో సీఐ దశరథ రామారావు, కేంద్ర బలగాలు

తెనాలిరూరల్: శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, మరీ ముఖ్యంగా ఎన్నికల సమయంలో అలజడులు సృష్టిస్తే ఉపేక్షించేది లేదని వన్‌టౌన్ సీఐ జి.దశరథరామారావు హెచ్చరించారు. తెనాలి వన్‌టౌన్ పోలీసులు, సీఐఎస్ఎఫ్ బలగాలు సోమవారం పట్టణంలోని చినరావూరుతోట, రామలింగేశ్వరపేట, నెహ్రూరోడ్డు, డిపో సెంటరు, బోస్‌రోడ్డులో రూట్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలన్నారు. అసాంఘిక శక్తులను గుర్తించి కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. ప్రశాంత వాతావరణంలో ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలందరూ ధైర్యంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలు ఎన్నికల్లో తమ ఓటుని సద్వినియోగం చేసుకునేందుకు ఎలాంటి భయాందోళనకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసు భద్రత మీ వెంటే ఉంటుందన్న నమ్మకాన్ని ప్రజల్లో కల్పించేందుకు అన్ని ప్రాంతాల్లో రూట్ మార్చ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

### ఘనంగా గౌరారంగ ప్రభు జయంతి వేడుకలు

తెనాలిటౌన్: పట్టణ గాంధీనగర్‌లోని కుసుమ హరనాథ మందిరంలో గౌరారంగ ప్రభు జయంతి వేడుకలు సోమవారం ఘనంగా జరిపారు. మందిరంలో ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5.45 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అత్తోట యాదవపాలెంకు చెందిన భక్తులు హరేరామ–హరేకృష్ణ నామ సంకీర్తన చేశారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఎస్వీయోగ కన్వీనర్ ఎం.రమణయ్య, మందిరం కమిటీ సభ్యులు సుజాత, మోహనరావు, భక్తులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం



బాపట్ల: రాష్ట్ర ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకాలను పార్టీ కార్యాలయం ప్రకటించింది.

బాపట్ల పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులుగా జోగి రాజా, బీసీ సెల్ అధ్యక్షులుగా నర్రావుల వెంకట్రావు, మహిళా విభాగం అధ్యక్షురాలుగా వేల్పుల మీరాబి, మైనార్టీ సెల్ అధ్యక్షులుగా హబ్‌జల్ షేక్‌ను నియమించారు.

- **బాపట్ల మండలం**

ఎస్సీ సెల్ మండల అధ్యక్షులుగా దేవరపల్లి రవి, బీసీ సెల్ అధ్యక్షులుగా గంగిశెట్టి రత్తయ్య, మహిళా విభాగం అధ్యక్షులుగా వల్లు శివపార్వతి, మైనార్టీ సెల్ అధ్యక్షులుగా షేక్ కరీముల్లాలను నియమించారు.

- **కర్లపాలెం మండలం**

ఎస్సీ సెల్ అధ్యక్షులుగా సలగల ధర్మేంద్ర, బీసీ సెల్ అధ్యక్షులుగా యల్లావుల గిరిబాబు, మహిళా విభాగం అధ్యక్షులుగా పోతురాజు వెంకటేశ్వరమ్మ, మైనార్టీ సెల్ అధ్యక్షులుగా పఠాన్ షంషేర్‌ఖాన్‌లను నియమించారు.

- **పిట్టలవానిపాలెం మండలం**

ఎస్సీ సెల్ అధ్యక్షులుగా చేబ్రోలు వీరయ్య, బీసీ సెల్ అధ్యక్షులుగా యెనుమల కోటేశ్వరరావు, మహిళా విభాగం అధ్యక్షులుగా బడుగు మాధవి, మైనార్టీ సెల్ అధ్యక్షులుగా షేక్‌మహ్మద్ రఫీలను నియమించారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుంటా

### వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి



దివ్యాంగురాలికి వీల్‌చైర్ అందజేస్తున్న వరికూటి అశోక్‌బాబు

పోతుమర్రు(వేమూరు): ప్రభుత్వ సహకారం ప్రతి కుటుంబానికి ఉంటుందని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు అన్నారు. వేమూరు మండలంలోని పోతుమర్రు గ్రామంలో వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు ద్వారా ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందడం జరిగిందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వేమూరు నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని గ్రామస్తులంతా తనను ఆశీర్వదించాలని కోరారు. ఈ నెల 27 నుంచి నియోజక వర్గంలో ఎన్నికల ప్రచారం ప్రారంభించడం జరుగుతుందన్నారు. పోతమర్రు గ్రామ ప్రజలు సమస్యలు ఉంటే కూచిపూడి గ్రామానికి వచ్చి తెలియజేయాలని కోరారు. గ్రామంలో దివ్యాంగురాలు వీల్ చైర్ లేక ఇబ్బందులు పడుతుంటే స్వచ్ఛంద సంస్థతో మాట్లాడి వీల్ చైర్ అందించడం జరిగిందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కూచిపూడి మైనా, ఎంపీటీసీ సభ్యురాలు ఈపూరు కుసుమ, ఎంపీపీ యల్లమాటి మోహన్, మండల పార్టీ అధ్యక్షుడు బొల్లిముంత ఏడుకొండలు, సొసైటీ అధ్యక్షుడు గాజుల భాను ప్రకాశ్, నాయకులు కూచిపూడి బెన్ను, ఈపూరు బాబూరావు, కట్లవరపు సలోమాన్, చందోలు బాబూరావు, తెనాలి జక్రయ్య, కట్లవరపు నరేష్, ఈపూరు బోజేష్, బొట్టు శ్రీను, పోటేల చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమావళి అపహాస్యం



క్రాపలో చర్చి వెనుక ప్రాంతంలో ఓ గృహంపై దర్శనమిస్తున్న టీడీపీ జెండాలు

కొల్లూరు : ఎన్నికల నిబంధనలను టీడీపీ శ్రేణులు ఉల్లంఘిస్తూనే ఉన్నాయి. ఎటువంటి అనుమతులు లేకుండా సొంత గృహాలపై రాజకీయ పార్టీల జెండాలు, ఫ్లెక్సీలు ఉంచరాదని ఎన్నికల అధికారులు జారీ చేసిన ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ గృహాలపై టీడీపీ జెండాలను ఏర్పాటు చేసి ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్నారు. మండలంలోని క్రాపలో ప్రధాన చర్చి వెనుక ప్రాంతంలో ఓ గృహంపై టీడీపీ జెండాతో పాటు ఆ పార్టీ నేత నారా లోకేష్ చిత్రంతో కూడిన యువగళం జెండాలు దర్శనమిస్తుండటంపై వైఎస్సార్ సీపీ శ్రేణులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు అధికార పార్టీకి చెందిన శిలా ఫలకాలు, ఇతర ఫ్లెక్సీలను తొలగించడంపై చూపిస్తున్న శ్రద్ధ ప్రతిపక్ష టీడీపీ జెండాలను తొలగించడంలో చూపకపోవడం విమర్శలకు తావిస్తుంది. తక్షణం అధికారులు స్పందించి టీడీపీ జెండాలను తొలగించడంతో పాటు బహిరంగ ప్రదేశాలలో ఆ పార్టీ రంగులను సైతం తొలగించాలని కోరుతున్నారు.

## ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలి

### హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ వినతి



డీఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న నాగరాజు

తెనాలి: సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్)ని పకడ్బందీగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, సామాన్యులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ముంబై) కోస్తాంధ్ర అధ్యక్షుడు పల్నాటి నాగరాజు విజ్ఞప్తి చేశారు. ఆ ప్రకారం సోమవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ ఎం.రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలు నియమావళిని ఉల్లంఘించరాదని, విద్యార్థి, యువజన సంఘాలు సభలు, సమావేశాలకు, ప్రదర్శనలకు తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. సామాన్య ప్రజల రక్షణకోసం తమ కౌన్సిల్ ఎప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. వీరితో తెనాలి నియోజకవర్గ కన్వీనర్ నన్నపనేని సునీల్‌కుమార్, కమిటీ సభ్యులు ఎం.మణికంఠ, ఎం.లిఖిత్, కె.ఫణికుమార్, శివశ్యాం, చరణ్ ఉన్నారు.

## ఘనంగా నాంచారమ్మతల్లి తిరునాళ్ల



భారీ విద్యుత్ ప్రభలు



ప్రత్యేక అలంకరనలో నాంచారమ్మతల్లి

శలపాడు(చేబ్రోలు): మండలంలోని శలపాడు గ్రామ దేవత నాంచారమ్మ తల్లి తిరునాళ్ల సోమవారం వైభవంగా జరిగింది. పురాతనమైన అమ్మవారి ఆలయాన్ని భక్తుల సహకారంతో రెండేళ్ల క్రితం పునఃనిర్మించారు. పాల్గుణ పౌర్ణమి నేపథ్యంలో నాంచారమ్మ తల్లికి అర్చకులు ప్రత్యేక పూజలు, విశేష కార్యక్రమాలు నిర్వహించారు. పంచామృతాభిషేకాలు, విశేష అలంకరణ చేశారు. శలపాడు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై పొంగళ్లు పొంగించి, మొక్కులు తీర్చుకున్నా రు. తిరునాళ్ల సందర్భంగా భక్తులు ఆలయ ప్రాంగణంవద్ద భారీ విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

## ప్రజారంజక పాలన సీఎం జగన్‌తోనే సాధ్యం

పిట్టలవానిపాలెం: మీకు మంచి జరిగితేనే నాకు అండగా ఉండండని ఎన్నికలకు వెళ్తున్న ఒకే ఒక్క నాయకుడిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని బాపట్ల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి కోన రఘుపతి తనయుడు కోన నిఖిల్ అన్నారు. మండలంలోని సంగుపాలెం గ్రామంలో విఘ్నేశ్వరుని దేవాలయంలో పూజలు చేసి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తి చేసి నవరత్నాల రూపంలో సంక్షేమాన్ని ప్రజలకు అందించి సగర్వంగా ఎన్నికలకు వెళుతున్న ఏకైక నాయకుడు సీఎం జగన్ అని పేర్కొన్నారు. బాపట్ల శాసన సభ్యునిగా కోన రఘుపతిని మూడోసారి ఆశీర్వదించాలని కోరారు. బాపట్ల జిల్లా అభివృద్ధి మరింత ముందుకు వెళ్లాలంటే బాపట్లకు ఎమ్మెల్యేగా కోన రఘుపతి అవసరం ఉందన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ షేక్‌బాజీ, వైస్ ఎంపీపీలు దెందుకూరి సీతారామరాజు, చేబ్రోలు కృపానందం, స్థానిక సర్పంచ్ ఎనికేపల్లి శివకుమారి, ఎంపీటీసీ సభ్యులు గంగయ్య, మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, కుంతం ప్రసన్నరాజు, చేబ్రోలు వీరయ్య, మండే విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.